క్లుప్తంగా

అంతా అవాస్తవం



సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఫొటో

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఛత్రం ఎంపీయూపీ పాఠశాలలో పిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని గ్రామ కార్యదర్శి మారుతీప్రసాద్ తెలిపారు. మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడంతో పాఠశాలకు సెలవు ఇచ్చారన్నారు. పంచాయతీ కార్మికుడు మూడు చక్రాల సైకిల్ నిలపడంతో విద్యార్థులు దానిపైకి ఆడుకుంటుండగా ఎవరో ఫొటోలు తీశారన్నారు. అంతే తప్ప విద్యార్థులతో పనిచేయించలేదన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు...



బాలుడిని తండ్రి వద్దకు చేర్చిన వన్‌టౌన్ పోలీసులు

హిందూపురం అర్బన్: పట్టణంలోని మోడల్‌కాలనీకి చెందిన హర్ష (3) అనే బాలుడు మూడు రోజుల క్రితం తప్పిపోయాడు. మంగళవారం రహమత్‌పూర్ వాసులు ఆ బాలుడిని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సీఐ శ్రీనివాసులు ఆదేశాలతో కానిస్టేబుళ్లు రంగస్వామి, కొల్లప్ప బాలుడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం హర్షను తండ్రికి అప్పగించారు.

నేడు వాహనాల వేలం

హిందూపురం అర్బన్: హిందూపురం సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెబ్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను బుధవారం ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు సీఐ స్వర్ణలత తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండలంలోని జూలకుంట గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం అంజినప్ప, ఉపాధ్యాయుడు రవిశంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆంజనేయులునాయక్ మాట్లాడుతూ అంజినప్ప, రవిశంకర్ సేవలు మరువలేనివన్నారు.

పగిలిన పైప్‌లైన్



పైప్ పగిలి ప్రధాన రోడ్డుపైకి వస్తున్న నీరు

హిందూపురం అర్బన్: పట్టణంలోని పెనుకొండ రోడ్డులో పశుసంవర్ధక శాఖ కార్యాలయ సమీపంలో పైప్‌లైన్ పగిలింది. వారం రోజులుగా నీరు ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్నా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం తిరిగే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా మరమ్మతు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నీరుగంటి వీరప్ప మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే సోదరుడు మల్లికార్జున, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫకృద్దీన్ సాహెబ్, ఎంపీపీ ప్రమీల, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాలూరి శంకరరెడ్డి, బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర తదితరులు వీరప్ప మృతదేహం వద్ద నివాళులర్పించారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురానికి చెందిన నాగమణి అనే మహిళ కుటుంబ కలహాలతో మంగళవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మళ్లీ మగ్గాల సందడి

- 'నేతన్న నేస్తం'తో జీవం పోసుకున్న చేనేత పరిశ్రమ
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి



చీర సిద్ధం చేస్తున్న కార్మికుడు

సోమందేపల్లి: అగ్గిపెట్టెలో పట్టేంత చీర చేసిన అద్భుత కళా నైపుణ్యం చేనేత కార్మికులది. స్వాతంత్ర్య సంగ్రామం నుంచి సోమందేపల్లి చేనేత వస్త్రాలకు ఎంతో గుర్తింపు ఉంది. దాదాపు 10 ఏళ్ల క్రితం 6 వేల కుటుంబాలు చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవించేవి. కానీ గత ప్రభుత్వాలు చేనేతలను నిర్వీర్యం చేయడంతో పాటు ముడిసరుకులు ధరలు పెరగడంతో చేనేత పరిశ్రమ కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రతి ఏడాది రూ.24 వేలు ఆర్థిక సాయం అందిస్తుండటంతో మళ్లీ సోమందేపల్లి మండలంలో చేతిమగ్గాల సందడి మొదలైంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే చీరలు దేశంలో వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.

వివిధ రంగుల్లో పట్టు చీరలు

స్థానికంగా నేతన్నలు తయారు చేస్తున్న పట్టుచీరలు ఆకట్టుకుంటున్నాయి. అందులో భాగంగా డిజైన్ ఉన్న బట్ట రూ.6,500, బ్రోకేట్ రూ.8000, హాఫ్ బ్రోకేట్ రూ.7000, బార్డర్ లేట్ రూ.5000 చొప్పున ధరలు పలుకుతున్నాయి. ఒక్కో కార్మికుడు చీరను నేయడం ద్వారా వారానికి రూ.2500 నుంచి రూ.4 వేల వరకూ సంపాదిస్తున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు ఇక్కడికి వచ్చి చీర కొనుగోలు చేస్తున్నారు. చీరల తయారీకి సంబంధించిన ముడిసరుకులు కర్ణాటక నుంచి సరఫరా అవుతాయి. రేషం, జరి, వార్పులు రామ్‌నగర్, సిద్దలగట్ట, చిక్కబళ్లాపురం జిల్లాల నుంచి తీసుకొస్తారు. స్థానికంగా కూడా అక్కడి వ్యాపారస్తులు గురు, శుక్రవారాలలో ముడి సరుకులు విక్రయిస్తుంటారు.



వివిధ రకాల డిజైన్ల చీరలు

నాడు వెలవెల

2011 నుంచి చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. దీంతో చేతిమగ్గం నేయడం తప్ప ఇతర వృత్తి తెలియని నేతన్నలు వలసబాట పట్టారు. బెంగళూరు, హైదరాబాద్ లాంటి నగరాల్లో వాచ్‌మెన్, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించారు. వాటికి తోడు మరమగ్గాల పరిశ్రమతో చేతి మగ్గాలకు ఆదరణ తగ్గిపోయింది.

మళ్లీ పూర్వవైభవం..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేనేత పరిశ్రమకు ఊపిరి పోశారు. నేతన్న నేస్తం పథకం ద్వారా అర్హులైన చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గత రెండేళ్లలోనే దాదాపు 600 కుటుంబాలు చేతిమగ్గాలను ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు.

గత ప్రభుత్వాల వల్లే నిర్వీర్యం



చేనేత పరిశ్రమను గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడంతో కార్మికులు వలస వెళ్లిపోయారు. రుణాలు మాఫీ చేయక అప్పట్లో ఆత్మహత్యలు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం చేతి మగ్గాలు పుంజుకుంటున్నాయి. సీఎం వైఎస్ జగన్ హయాంలో నేతన్నలు సంతోషంగా ఉన్నారు.

– ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్, సోమందేపల్లి

నేతన్న నేస్తం ఆదుకుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నేతన్న నేస్తం పథకం ఎంతో ఊరటనిస్తోంది. రూ.24 వేలు ఆర్థిక సహాయం అందిస్తుండటంతో స్థానికంగానే ఎక్కువగా చేనేత మగ్గాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– నరసింహులు, చేనేత కార్మికుడు

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి



సోమందేపల్లిలో తయారు అయ్యే పట్టుచీరలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడి కార్మికులు మంచి డిజైన్లను తయారు చేస్తున్నారు. అందువల్లే సోమందేపల్లి నుంచి కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ వంటి నగరాలకు చీరలు ఎగుమతి అవుతున్నాయి.

– ఆదిమూర్తి, చీరల వ్యాపారి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటేష్ తెలిపారు. అనంతపురంలో జరిగిన అండర్ -17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో లతీస్, కీర్తన, అలాగే బేస్‌బాల్‌లో మహ్మద్‌షాహిద్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

యోగా ఇద్దరు..

లేపాక్షి: లేపాక్షిలోని ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు గిరి, పీఈటీ సురేష్ తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగిన అండర్-14 జిల్లాస్థాయి పోటీల్లో జెస్సుప్రియ, అండర్-17 విభాగంలో ప్రణతి ప్రతిభచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

చెస్‌లో ప్రజ్వల్...

అమరాపురం: మండల పరిధిలోని నిద్రగట్టకు చెందిన ప్రజ్వల్ ఇటీవల పావగడలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీఈటీ జగదీష్ , తల్లిదండ్రులు శారదమ్మ, ప్రకాష్ తెలిపారు. శిర తాలుకా రంగనాథపురంలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రజ్వల్ పదోతరగతి చదువుతున్నాడు. హెచ్‌ఎం.మంజునాథ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రజ్వల్‌ను అభినందించారు.



పెనుకొండ రూరల్: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

సజావుగా అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

పెనుకొండ: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కార్తీక్ నేతృత్వంలో అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు మంగళవారం సజావుగా జరిగాయి. పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టులో హెల్పర్ పోస్టులు 6 ఉండగా ఆరుగురు అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. మడకశిర ప్రాజెక్టుకు సంబంధించి అంగన్‌వాడీ వర్కర్ పోస్టు ఒకటి ఉండగా ఆరుగురు, హెల్పర్ పోస్టులు 10 ఉండగా 20 మంది హాజరయ్యారు. గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఒక అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీ ఉండగా ముగ్గురు అభ్యర్థులు హాజరయ్యారు. హెల్పర్ పోస్టులు 2 ఉండగా ఏడుగురు హాజరయ్యారు. హిందూపురం అంగన్‌వాడీ ప్రాజెక్టులో మినీ కార్యకర్త పోస్టు ఒకటి ఉండగా ముగ్గురు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. హెల్పర్ పోస్టులు 7 ఉండగా 8 మంది హాజరయ్యారు. సోమందేపల్లి ప్రాజెక్టులో హెల్పర్ పోస్టులు 3 ఉండగా ఆరుగురు హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు రెండు ఉండగా నలుగురు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మంజువాణి, సీడీపీఓలు శాంతలక్ష్మి, నాగమల్లేశ్వరి, అనూరాధ, రెడ్డి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ కార్తీక్, పీడీ లక్ష్మీకుమారి తదితరులు

సాదర కులస్తులను ఓబీసీలో చేర్చాలి

రొళ్ల: వెనుకబడిన హిందూ సాదర కులస్తులను ఓబీసీ జాబితాలో చేర్చడానికి చొరవ తీసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ శంకరనారాయణకు వినతిపత్రం అందజేసినట్లు తాలూకా హిందూ సాదర క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు గుడ్డగుర్కి రంగారెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం విజయవాడలో వినతిపత్రం అందజేశామన్నారు.

మానసిక ప్రశాంతతతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఏడీజే కంపల్లె శైలజ

హిందూపురం టౌన్: మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడే మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ, అదనపు మెజిస్ట్రేట్ రాజ్యలక్ష్మి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు, సలహాలిచ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్‌కుమార్, మానసిక వైద్య నిపుణులు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి శంకరరావు

పెనుకొండ: ప్రతిభకు అంగవైకల్యం అడ్డుకాదని సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని తోటగేరిలో మానసిక వైకల్య కేంద్రాన్ని న్యాయమూర్తితో పాటు బార్ అసోసియేషన్ నాయకులు నాగరాజు, న్యాయవాదులు సందర్శించారు. ఈ సందర్భంగా మానసిక వైకల్య కేంద్రంలోని చిన్నారులను, వారి తల్లిదండ్రులను పలకరించి చిన్నారుల స్థితిని తెలుసుకున్నారు. న్యాయవాదులు శ్రీరాములు, మోహన్‌నాయక్, వాల్మీకి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పావగడ: కరువు కాటకాలకు లోనై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థులకు ఆసరాగా నిలిచేందుకు పావగడ తాలూకా క్షేమాభివృద్ధి, సాంస్కృతిక సంస్థ అందిస్తున్న స్కాలర్‌షిప్‌కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు ఎస్‌కేవీ రెడ్డి తెలిపారు. పది, పీయూసీ, డిగ్రీ, పీజీ కోర్సుల్లో 80 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు స్కాలర్‌షిప్‌కు అర్హులన్నారు. సర్టిఫికెట్లతో బళ్లారి రోడ్డు ఇలాహి ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు, సంస్థ సభ్యుడు ఆర్టి ఖాన్‌కు ఈ నెల 16 లోగా దరఖాస్తులు సమర్పించాలన్నారు.

కొత్త ట్రిబ్యునల్‌తో నష్టం

హిందూపురం టౌన్: కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు పంపిణీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త ట్రిబ్యునల్‌తో తీవ్ర నష్టం వాటిల్లుతుందని జలసాధన సమితి నాయకులు అన్నారు. మంగళవారం జలసాధన సమితి ఆధ్వర్యంలో కొత్త ట్రిబ్యునల్‌ను రద్దు చేయాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ చేపట్టి అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్‌ఐకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జలసాధన సమితి గౌరవ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, అధ్యక్షుడు ధనాపురం వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి చైతన్య గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్న ఆరోగ్య సురక్ష '



పెనుకొండ: మాట్లాడుతున్న కమిషనర్ వంశీకృష్ణ



హిందూపురం: ఆటోనగర్ 13వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అగళి: ఇనగలూరులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కాశీవిశ్వనాథ్

సాక్షిబృందం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జోరుగా సాగుతోంది. హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం జగనన్న సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మండలాధికారులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హాజరైన వారికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్యుల సూచనలు మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి



వేణురెడ్డిని సన్మానిస్తున్న అంబేడ్కర్‌నగర్ వాసులు

హిందూపురం: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ సమీపంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించేలా కృషి చేయాలని కాలనీవాసులు వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డిని కోరారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి తరలివచ్చి వేణురెడ్డిని సన్మానించారు. అనంతరం వేణురెడ్డి మాట్లాడుతూ కాలనీలో సమస్యలు పరిష్కరించడంతో పాటు ఆలయ నిర్మాణానికి సహకరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొటిపి హనుమంతరెడ్డి, సుభాష్, శరత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కర్రా సంజీవరెడ్డిపై కేసు నమోదు

పెనుకొండ రూరల్: ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణపై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టింగులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. గొల్లపల్లికి చెందిన కర్రా సంజీవరెడ్డిపై రెండు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో పోసింగ్‌లు పెడుతున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు రామాంజినేయులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు సంజీవరెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు.

వెంకటేష్ కుటుంబానికి న్యాయం చేయండి

లేపాక్షి: ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న చిలమత్తూరు మండలం కొర్లకుంటకు చెందిన వెంకటేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నాయకులు విలేకరులతో మాట్లాడారు. కుశలవ కంపెనీ ఆధీనంలో భూములు ఉన్నాయనే మనోవేదనతోనే వెంకటేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. అయితే మద్యానికి బానిసై చనిపోయాడని తప్పుడు ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. కుశలవ కంపెనీ స్వాధీనం చేసుకున్న భూములు దళితులకు ఇచ్చే వరకు భూ పోరాటాం చేస్తామన్నారు. కార్యక్రమంలో హనుమయ్య, రమణ, వెంకటేష్, నారాయణప్ప, క్రిష్టప్ప, గోపాల్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలికా దినోత్సవం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బాలికలు, తల్లులు, మహిళలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం

హిందూపురం: కొటిపి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి రాజమోహన్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మెదడు సమస్యతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆల్‌వేస్ హెల్ప్ అదర్స్ ఆర్గనైజేషన్ సభ్యులు వైద్యం కోసం మంగళవారం బాధిత కుటుంబానికి రూ.26,100 ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు బాలకృష్ణ, సభ్యులు బాబా, శేఖర్, లత, బాలాజీ,మహేష్ తదితరులు పాల్గొన్నారు.